విహారి & శాలివాహన

మురళి జ్యోతిర్మయి కొక సమస్యగా తయారైనాడు. ఎటు నుంచీ ఎటు చూసినా ప్రశ్నార్థకం దగ్గరకే వచ్చి ఆగి పోతుంది ఆమె ఆలోచన. అతన్ని పూర్తిగా అర్థం చేసుకోవాలని ప్రయత్నిస్తున్న కొద్దీ విడని చిక్కుముడిలా కనిపిస్తున్నాడతను.

సమస్యల మీద వో పెద్ద 'ట్రీటైజు' రాయగలవాడు మురళి! అతని మాటల్లో, చేతల్లో సమస్యలు పరిష్కార మవుతూ వుంటాయంటాడు.

అలాంటి మురళి జోతిర్మయి కొక సమస్యగా తయారైనాడు!

క్రితం సాయంత్రం పబ్లిక్‌గార్డెన్‌లో అతనిచ్చిన ఉపన్యాసం తాలూకు పతాక శీర్షికలు కొన్ని గుర్తుకొచ్చేయి జ్యోతిర్మయికి.

అతనంటాడు, "వివాహాన్ని గురించి కొన్ని నిశ్చితమైన అభిప్రాయాల్ని పెంచుకోవాలి— ఈ కాలపు యువతీ యువకులు. సంఘ సంస్కరణలంటూ గొంతు చించుకోక, తమచేతనైన విధంగా సంఘ దురన్యాయాల్ని రూపు మాపాలి. ఉదాహరణకి నన్ను తీసుకోండి. నేనొక కోటీశ్వరుడికి దత్తపుత్రుణ్ణి. ఆ వైపు నుంచీ నాకొక మరదలుంది. ఆమెను పెళ్ళాడమని మావాళ్ళందరి ఒత్తిడి. నాకది సుతరామూ ఇష్టం లేదు. ఎందుకనో తెలుసా? — నాలుగు తరాలకి సరిపోను వాళ్ళకీ వుంది ఆస్తి. అంతే. నేను డబ్బు జెంగలేనివాణ్ణి కనుక, వో చక్కటి బీదయింటి పిల్లను పెళ్ళాడతాను. దీని వల్ల భవిష్యత్తులో ఎంతో మేలు జరుగుతుంది. నాలా కొంత మంది ధైర్యం చేయగలిగితే, సమాజ వ్యవస్థ పూర్తిగా మారి పోతుంది మనం ఆశిస్తున్న 'సోషలిష్టిక్ పాటర్న్ ఆఫ్ సొసైటీ'ని నిర్మించటానికి ఎంతో కాలం పట్టదు." అని.

ఇలాంటి ఆశయాల్ని వ్యక్తంచేస్తూ, తనకు సన్నిహితుడవుతున్న మురళీ జ్యోతిర్మయి కొక సమస్యగా, విడని చిక్కుముడిగా కనిపిస్తున్నాడు!

క్రితం సాయంత్రం అంతటి దృఢమైన అభిప్రాయాల్ని వ్యక్తీకరించిన మురళీ, ఈ వేళ మరొక వార్త తీసుకొచ్చేడు. పైడిరాజు అని అతనికొక మిత్రుడున్నాడు. అతనూ యితనిలా, పుట్టూ కూడా ఏడుపు లేకుండా పుట్టిన ఘనుడట! ఇతగాడు కోటికి వారసుడైతే, అతగాడొక పది కోట్లకు వారసుట్ట! అలాంటి పైడిరాజు ప్రేమించి పెళ్ళి చేసుకున్నాడు.

మురళికి మహదానందాన్ని కలిగించిన వార్త! అయితే, వివరాలు తెలుసుకుని చిరాకుపడి, అతన్ని అసహ్యించుకుని లో లోపల తిట్టుకున్నాడు మురళి. దానికి కారణం పైడిరాజు ప్రేమించి పెళ్ళాడిన యువతి — వో అతిబీద పిల్ల కావటం మాత్రమే కాదు, కాస్త అనాకారి కావటం! పైడిరాజు పంపిన పెళ్ళి ఫోటో జ్యోతిర్మయికి చూపి, "ఇలాంటి అనాకారి పిల్లని పెళ్ళాడతాడని కలలో కూడా అనుకోలేదు. మరీ గ్రుడ్డివాడై పోయాడు— వీడి ప్రేమా, వీడూ పాడుగానూ!" అన్నాడు మురళి.

మురళి చుట్టూ తాను అల్లి

కుంటున్న నమ్మకాల గూడు చెదిరింది జ్యోతిర్మయికి. అతని భావాన్ని తన కన్వయించుకుని విమర్శించు కోవటం ప్రారంభించింది. తాను బీద యింటిది, పెద్ద అందగత్తే కాదు. మరి, మురళి తన నాకర్షించటాని కెందుకు ప్రయత్నిస్తున్నట్టు?

వారం రోజుల క్రితమూ అతని లాంటి పరస్పర విరుద్ధమైన రెండు అభిప్రాయాల్ని తనకు తెలియ జేసేడు. ఆవేళ తానూ, అతనూ కలిసి బజారున వస్తున్నారు. మురళి వున్నట్టుండి ఒక అమ్మాయిని చూపి, "ఆమె మా ఆఫీసు లోనే పన్జేస్తున్నది. ఆడవాళ్ళు ఉద్యోగాలు చేయటంలో తప్పులేక పోయినా, బరితెగించి పదిమందిలో తేలిగ్గా మారటం మాత్రం నాకు నచ్చదు. అంటే, నే చెప్పొచ్చే దేవిటంటే, 'కారెక్టర్' గురించి" అని ఆ ప్రసంగాన్ని త్రుంచేశాడు.

మురళి మాటలు తనలో పెద్ద సంచలనాన్ని కలిగించాయి. తనూ ఉద్యోగం చేస్తున్న ఆడది. అందువల్ల పదిమందితో కలిసి మెలిసి వుండటం తప్పదు. అంత మాత్రానికే 'కారెక్టర్'ని గురించి వూహాగానం ప్రారంభిస్తే? — తానెలా నమ్మించ గలదు, తన నైర్మల్యాన్ని గురించి!

జ్యోతిర్మయి అసహనంగా కుర్చీలో అటూ యిటూ జరిగింది. ఉన్నట్టుండి ఆమెకొక ప్రశ్న ఎదురైంది— అసలు మురళిని గురించి తానెందుకింతగా ఆలోచించాలి?

క్షణాల్లో ఆమె పెదవుల మీద సన్నని నవ్వు విరిసింది. బుగ్గలు సిగ్గుతో ఎరుపెక్కి, ముఖం సంతోషంతో ప్రఫుల్లమైంది. ఉత్సాహంగా లేచి, మంచం మీదికి దూకింది. మరి కొంత సేపటికి, ఆమె నేవేవో తీయటి కలలు చుట్టేసినై!

—బయటి తలుపు శబ్దం కావటంతో ఉలిక్కి పడి లేచింది, జ్యోతిర్మయి. తలుపును ఎవరో కొట్టున్నారు. విసుగ్గా మంచం దిగి లైట్ వేసింది. టేబుల్ మీది టైంపీస్ పదకొండూ పది నిముషాలు చూపుతోంది. సందేహంగానే వెళ్ళి తలుపు తీసింది.

ఎదురుగా మురళి.!

జ్యోతిర్మయి ఆశ్చర్య పోయింది. అంతలోనే తేరుకుని, లోపలికి నడుస్తూ "రండి" అంది.

మురళి భారంగా అడుగులు వేస్తూ వచ్చి కుర్చీలో కూర్చున్నాడు.

"ఏమిటి యింత రాత్రి వేళ హఠాత్తుగా......"

జ్యోతిర్మయి మాటల్ని మధ్యలోనే త్రుంచేస్తూ అన్నాడు మురళి, "రావాల్సొచ్చింది. ఇక్కణ్ణుంచి యింటికి వెళ్ళానా? నే వెళ్ళేసరికి, అమ్మా నాన్నా కూర్చుని నా పెళ్ళి గురించి మాట్లాడు కుంటున్నారు. సమయానికి వెళ్ళటంతో నా అభిప్రాయాన్ని తెల్చి చెప్పమని నిల వేసేరు. ఒక్క రోజు గడువడిగి ఇలా వచ్చాను."

జ్యోతిర్మయి మౌనం వహించింది. మురళి వ్యక్తిత్వాన్ని గురించి తను పూర్తిగా అవగాహన చేసుకోకుండా ఏ నిశ్చయానికి రాగలదు?

క్షణాల తర్వాత మురళే అడిగేడు, "నా భవిష్యత్తిప్పుడు నీ మీద ఆధారపడి వుంది, జ్యోతీ. నీ నిర్ణయం నా కనుకూలంగా వుంటుందనే ఆశతో గాలి పీలుస్తున్న వాణ్ణి నేను. అయితే, ఒక్క విషయం మాత్రం నేను నీకు తేల్చి చెప్పాలి."

జ్యోతిర్మయి ఉత్సుకతతో అతని మొహంలోకి చూసింది.

"నేనొక పెద్ద కోటీశ్వరుణ్ణి గదా అనే సందేహాన్ని మాత్రం నీ మనస్సులో వుంచుకోకు. ఆ అంతరం వల్ల నీ మనసెనాడూ నొప్పించనని మాటివ్వ గలను. ఇక, మీ తమ్ముడూ, చెల్లెళ్ళని గురించి నీ కెంత బాధ్యత వుందో, నాకూ అంతే వున్నట్టు భావిస్తాను. వాళ్ళిద్దరికీ ఏ లోపం రాకుండా చూసుకోగలం మనం. నీ కింకేమైనా అనుమానాలుంటే అడుగు."

మురళి చెప్పినదంతా వూపిరి బిగపట్టి విన్నది జ్యోతిర్మయి. అప్రయత్నంగా, ప్రక్కనే పడుకునివున్న తమ్ముడూ చెల్లెలు మీదకి మళ్ళినై ఆమె చూపులు.

క్షణాలు నిశ్శబ్దంలో దొర్లిపో తున్నాయి. జ్యోతిర్మయి మనస్సులో అనేక ప్రశ్నలు పుట్టి చెదరి పోతున్నాయి. మురళి ఆమె వైపు చూస్తూ వుండి పోయేడు.

కొద్ది సేపటికి గొంతు పెగల్చుకుని అంది, జ్యోతిర్మయి "నన్నూ ఆలోచించుకో నివ్వండి" అని.

"అలాగే...... ఉదయాన్నే వస్తాను" అంటూ వెళ్ళి పోయేడు మురళి.

మంచం మీద పడుకున్న జ్యోతిర్మయికి ఎన్నెన్నో ఆలోచనలు కలిగేయి. నిర్దుష్టమైన అభిప్రాయాలు లేక, పేల పిండిలా గాలికి కొట్టుకుపోయే ఆశయాలతో, డాంబికానికి పది మాటలు మాట్లాడటం నేర్చిన మురళి— తన గత చరిత్ర వింటే— నిజంగా తనను ప్రేమించి పెళ్ళాడ గలడా?

వ్యక్తిగత సంస్కారం మీద సమస్యల పరిష్కారాలు ఆధారపడి వుంటాయని వాదించే మురళి— ఈ సమస్య కొక పరిష్కారం చూపి, తన నిశ్చయాన్ని, ప్రేమను మార్చుకోకుండా వుంటాడా?

తమ్ముడు, చెల్లెళ్లను గురించి తనకు ధైర్యం చెప్తున్న మురళి, వాళ్లను తన వాళ్ళుగా చూసుకో గలడా? వీటన్నిటికీ మించి, తమ పిల్లను కాదని తనను చేసుకున్న మురళిని అతని తల్లిదండ్రులు క్షమిస్తారా? క్షమించినా, తనను ఆదరిస్తారని నమ్మక మేవిటి?

కన్న వారి ప్రేమకు, ఆదరణకే నోచుకోని తను పరుల ఆదరణని ఆశించటం ఎండమావిలో నీళ్ళున్నవని భ్రమించటమే అవుతుంది!

జ్యోతిర్మయికి కళ్ళు చెమ్మగిలినై. పైట కొంగుతో కళ్ళు తుడుచుకుని ప్రక్కకు తిరిగింది. 'ట్రాన్స్ ఫార్మర్' వెలుతురు గోడల మీద చిత్ర విచిత్రమైన వెలుగు నీడల్ని సృష్టిస్తోంది. గతమంతా దృశ్యరూపంగా గోచరించ సాగింది జ్యోతిర్మయికి!

బీదవాళ్ళింట్లో పెద్ద కూతురుగా పుట్టటం మహాపాప ఫలమని తొలిసారిగా అనిపించింది తనకు ఆ రోజుల్లో. ఏడవ కాన్పుకు సిద్ధమవుతున్న తల్లి ఇంటెడు చాకిరీ తనకే అంటగట్టేగి— శరీరంలో శక్తి ఉడిగి పోవటం ఎల్లా. పదమూడవ ఏటనే బ్రతుకులో బరువు బాధ్యతల్ని నెత్తిన పెట్టుకుని, ఇంటి

ని పూర్తిచేసి స్కూలుకు వెళ్ళి చదువుకో వలసి వచ్చింది. కన్న తల్లికి ప్రేమ, ఆదరణా లేకపోయినా, పిల్లల్ని పెంచాలనే తపన, వాళ్ళ సంరక్షణ ఎలా గడుస్తుందా అనే తాపత్రయమన్నా వుండేవి. నాన్నకి అవీలేవు. ఏవేవో మూలికలనీ, మందులనీ అక్కడక్కడా తిరగటం ఎప్పుడో యింటికి వచ్చి వెళ్తూ వుండటం, కుటుంబ బాధ్యత ఏనాడూ లేదాయనకు.

సంవత్సరాని కొచ్చే పది బస్తాల ధాన్యంతో తిన్న వాడు తినీ, లేనినాడు లేకా రోజులు వెళ్ళబుచ్చటం అలవాటు అయిపోయింది. ఉన్నట్టుండి పిడుగు లాంటి వార్త తెలిసింది తమ కోరోజున. నాన్న సన్యాసుల్లో కలిసి పోయాడు! కాషాయ వస్త్రాలు కట్టుకుని ఔషధాలు తయారు చేయుటం కోసం ఎక్కడో ప్రయత్నాలు చేస్తున్నాడని విన్నరోజున అమ్మా, తనూ కుమిలి పోయారు. భార్య అనుమతి లేకుండా సన్యాస మేమిటో?— తండ్రంటే అసహ్యం వేసిన మాటనిజం తనకు. పెళ్ళాం బిడ్డల్ని వాళ్ళ కర్మకు వాళ్ళను వదలి తప్పించుకు పోయేందుకు వుపయోగించిందా, సన్యాసమని పించింది. బాధ్యతారహితంగా ప్రవర్తించే అలాంటి వాళ్ళని ఏ కఠిన శిక్షకు గురిచేస్తే బాగుంటుంది?—

ఉండలేని వాడయి పోయాడు నాన్న. అమ్మ లేకుండానే పోయింది, మరో దుర దృష్టి జీవిని భూమి మీద వదలకుండానే. దైవం లాంటి మావయ్య సంరక్షణలో తన కాళ్ళ మీద తాను నిలవ గలిగే స్థితి కొచ్చింది తను. పల్లెత్తుమాటన కుండా, కష్టమో నిష్ఠూరమో భరించి ఐదేళ్ళు పోషించిన మావయ్య, అత్తయ్యల ఋణం జన్మ జన్మలకూ తీర్చుకో లేనిది.

ఉద్యోగం దొరికి ఈవూరు వచ్చేనాడు—

మావయ్య సలహా యిచ్చాడు, "పెద్ద పిల్లల్నిద్దర్నీ తీసుకు వెళ్ళి చదువు చెప్పించుకో. నీకూ ధైర్యంగా వుంటుంది. తోడుగా వుంటారు. మిగిలిన ముగ్గురూ ఇలాగే ఇక్కడుంటారు."

నీళ్ళు నిండిన కళ్ళతో అత్తయ్యకు, మావయ్యకూ నమస్కరించి వచ్చేసింది.

దృశ్యం తెగింది. జ్యోతిర్మయి ఈ లోకంలో పడింది.

# అద్దం తిరిగిన కథ

ప్రక్కన చూస్తే రమణి! జ్యోతిర్మయి ఆశ్చర్య పడింది. తన భుజం మీద చెయి వేసి జాలి చూపులు చూస్తోంది చెల్లెలు. "ఎప్పుడు లేచావే?" అంది జ్యోతిర్మయి.

అక్క ప్రశ్నకు సమాధానం చెప్ప కుండానే, "ఎన్నాళ్ళిలా ఆలోచిస్తూ మనసు పాడుచేసుకుంటా వక్కా? మన మిక్కడికి వచ్చేటప్పుడు మావయ్యన్న మాటలు గుర్తు తెచ్చుకుని ఒక నిశ్చయాని కొచ్చెయ్" అంది రమణి.

జ్యోతిర్మయి నివ్వెర పోయింది. అయితే, రమణికి అన్నీ తెలుసన్నమాట. ఇప్పుడు తనకూ మురళికీ జరిగిన సంభాషణ కూడా వినే వుంటుంది. 'అవును, ప్రాయకం తెలిసి బి. యే. చదువుతున్న పిల్ల. మంచీ చెడూ తెలియకుండా ఎలా వుంటుంది' అనిపించింది. తను హైదరాబాద్ వచ్చేటప్పుడు కడసారిగా మావయ్య అన్న మాటల్ని మననం చేసుకుంది జ్యోతిర్మయి.

"గతంలో జరిగి పోయిన దానికే నేనెంతగానో కుమిలి పోతున్నాను. భవిష్యత్తులో కూడా నిన్నిలా చూడలేను. త్వరలోనే నువ్వొక యింటి దాని వైతే, నాకంటే సంతోషించే వారుండరు. అన్నీ తెలిసిన దానివి, ఆలోచించి నిర్ణయించుకో"—

మూడేళ్ళనుంచీ ఆలోచిస్తూనేవుంది తను. మరీ, మురళితో పరిచయం అధికమై, తన మనస్సు అతని వైపు మొగ్గటం ప్రారంభించిన నాటి నుంచీ తీవ్రంగా ఆలోచిస్తూ వుంది. కాని, తన గొంతుకలో కొట్టుకులాడే ఆ కఠిన సత్యాన్ని ఎంతగా ప్రయత్నించినా మురళి ముందుంచలేక పోతుంది.

నిజానికి, మావయ్య చెప్పినట్లు ఒక యింటిది కావాలనే కోరిక తనకూ వుంది. అందువల్లనే తన మనస్సును మురళికి అంకితం చేసింది. అతనితత్వం పూర్తిగా అర్థంకాక ఏవేవో సందేహాలు కలుగు తున్నాయే గాని, మురళిని తన భాగస్వామిగా ఎంచుకోవట మనేది ఎప్పుడో జరిగి పోయింది.

రమణి కుదుపుతో ఆలోచన త్రెంచి ఆమె వైపు చూసింది జ్యోతిర్మయి. రమణి అక్క కళ్ళల్లో కళ్ళుంచి, "నీ సందేహమంతా ఆయన మాటల్లో వ్యత్యాసాన్ని గురించేగా?" అంది.

జ్యోతిర్మయి ఈ ప్రశ్నకు విచలిత య్యింది. 'తన మనోభావాల్ని ఎంత చక్కగా పసికట్టింది రమణి!' అని పించింది. అంతలోనే చిరుకోప మొచ్చింది. "నీకెందు కివన్నీ, నువు నిద్రపో" అంది.

రమణి సన్నగా నవ్వుతూ, "నువ్వు చెప్పక పోయినా, నీ డైరీ నాకన్ని విషయాలూ చెప్తూనే వుందక్కా" అని పక్క మీద వాలింది.

"హాఁ...దొంగా.... ఇదా నీ పని?" అని చెల్లెలి మీదకు చెయి విసరింది జ్యోతిర్మయి. రమణి అవతలికి జరిగింది. పిచ్చి ఆలోచనలు పెట్టుకోక, సరే అను. మనిషన్న తర్వాత బలహీనతలు ఎవరి కుండవు?"

జ్యోతిర్మయిలో మళ్ళీ సంచలనం మొదలైంది. రమణి మాటల్లోని సత్యాన్ని గ్రహించిందామె మనస్సు. మురళి రూపం ఆమె కళ్ళ ముందు మెదిలింది. అతని నొక్కుల జుట్టు, ముఖానికంతా అందం తెచ్చే సన్నని మీసం, మనిషికున్న గాంభీర్యాన్నంతా సూచించే ముఖం గోచరించేయి. క్షణంలోనే ఆమెకు కలిగిన భావాలకు సిగ్గేసింది. ఏదో నిశ్చయాని కొచ్చినట్లు దీర్ఘంగా ఊపిరి పీల్చుకుని, చెల్లెల్ని కౌగిలించుకుంది జ్యోతిర్మయి!

*   *   *

మురళి కుర్చీలోంచి లేచి ఉద్వేగంతో ఒక్కడుగు ముందుకు వేశాడు. జ్యోతిర్మయిని రెండు చేతుల్లోనూ పొదివి పట్టుకుని ఆమె కళ్ళల్లో కళ్ళుంచి తమకంతో చూసేడు. ఆనందంతో పూడుకు పోయిన కంఠం పెగల్చుకుని, "నిజం, జ్యోతీ?" అని అడిగేడు.

జ్యోతిర్మయి పైట కొంగును మునిపంట కొరుకుతూ, "ఊఁ" అని విలాసంగా ప్రక్కకు తిరిగింది.

అలవోకగా ఆమెను దగ్గరగా లాక్కుంటూ అన్నాడు మురళి, "నువ్వింత శుభ వార్త చెప్తావని నమ్మలేకపోయాను జ్యోతీ. ఎంతగా మనసుకు నచ్చచెప్పుకున్నా, అంతరాంతరంలో ఏదో సందేహం పీడిస్తూనే వుంది."

సన్నగా నవ్వి అంది జ్యోతిర్మయి. "నమ్మకానికీ, అబ్బాయిలకూ మధ్య కొన్ని వేల కిలో మీటర్ల దూరం."

"ఏమైతేనేం. నేను అదృష్టవంతు

జ్ఞాని మరో సారి బుజావైంది.'' అని హుషారుగా కుర్చీ లోంచి లేచి, "ఈక్షణంనుంచీ రాణిగారు మేం చెప్పినట్లు వినాలి. ఈ రోజల్లా 'లైట్' ప్రోగ్రామ్, వేసేస్తాం'' అని బయటికి నడవబోయేడు మురళి.

"అప్పుడే అధికారం చలాయిస్తున్నారు గానీ, కొంచెం ఆగండి. కాఫీ పుచ్చుకుని వెళ్దురు గాని.''

"నో కాఫీ....నథింగ్ ..... చిటికెలో వచ్చేస్తాను, నువ్వు 'రెడీ' గా వుండు. ముందు సరాసరి మా యింటికి వెళ్లి అమ్మా నాన్నకీ శుభ వార్త చెప్పాలి. ఈ లోగా ఒక్కసారి ఆఫీసుకు వెళ్లొస్తాను, కొంచెం అర్జంటు పనుంది.''

"ఇప్పుడెలాగండీ, రాజు, రమణీ కూడా ఇంట్లో లేరు......'' అని ఇంకా ఏదో చెప్పబోయింది గాని, మురళి అప్పటికే కార్లో కూర్చుని స్టార్ట్ చేశాడు.

— జ్యోతిర్మయి ముస్తాబయి హాల్లో కొచ్చేసరికి వచ్చేశాడు మురళి. వస్తూనే పట్టరాని సంతోషంతో ఆమెను తన బాహువుల్లో బంధించి ఉక్కిరి బిక్కిరి చేస్తూ చెప్పేడు, "నీ నిశ్చయం నాకెంత ఆనందాన్నిచ్చిందో అంతకంత ఆనందకరమైన వార్త అందింది జ్యోతీ.''

జ్యోతిర్మయికి అర్థం కాలేదు. అతని సంతోషాన్ని చూస్తుంటే ఆశ్చర్యమూ కలిగింది. "ఏమిటో, శుభ వార్త?'' అంది ఉత్సుకతతో, అతని చేతుల్ని విడిపించు కుంటూ.

"నో....శుభ వార్తే, జ్యోతీ....గొప్ప శుభవార్త! నా జీవితంలోనే ఈ రోజు కొక ప్రత్యేకత ఏర్పడింది. నిజంగా నే నదృష్టవంతుణ్ణి'' అని పరవశంతో వూగిపోతూ, కోటు జేబులో నుంచి కవరు తీసి ఆమెకిచ్చేడు మురళి.

కాగితంలోని విషయం చదవటం పూర్తి చేసిన జ్యోతిర్మయి, "బాగుంది... మంచివార్త'' అని ముభావంగా, అని నిరుత్సాహంగా కుర్చీలో కూర్చుండి పోయింది.

కవరందుకుంటూ ఆశ్చర్యంగా అడిగేడు మురళి, "అదేం జ్యోతీ, అలా అయిపోయావ్? నాకింత చక్కటి అవకాశం రావటం సంతోషం కదూ?'' అంతలోనే ఏదో స్ఫురించిన వాడిలా, తేలిగ్గా నవ్వేసి అన్నాడు, "ఓహో... అదా నీ బెంగ! నేన్నీకు దూరమవుతున్నాననేగా? సంవత్సరమంటే ఎన్నాళ్లు — గిర్రున తిరిగి రాదూ? ఏడాదయ్యే సరికి తిరిగొచ్చి నీ ముందు వాలి, నీకు పారిస్ వింతలు చెప్పనూ?''

జ్యోతిర్మయి మ్లానంగా నవ్వింది. "అహహ. అదేం లేదు.'' అని విషయం మారుస్తూ, "వెళ్దామా మరి'' అంది.

"ఓ...కే....'' అంటూ ఉత్సాహంగా ఈలవేసి బయల్దేరాడు మురళి.

—కారులో కూర్చున్న జ్యోతిర్మయి మనసులో మురళి తల్లి దండ్రుల్ని గురించీ, అతని విదేశ పర్యటన గురించీ ఎన్నెన్నో ఆలోచనలు రేగినై. పెళ్లిని గురించి తానొక నిశ్చయాని కొచ్చి, తీరా అది ఫలించబోయే తరుణంలో ఈ ఆటంకం! పదిహేను రోజుల్లో ఫ్రాన్స్‌కు బయల్దేరి వెళ్లిపోతాడు మురళి. సంవత్సరమంతా అతని కోసం నిరీక్షణ!

"రా. జ్యోతి'' అన్న మురళి పిలుపుతో ఉలిక్కి పడింది జ్యోతిర్మయి. కారు తలుపు తీసి చిరునవ్వుతో ఆహ్వానిస్తున్నాడు మురళి. జ్యోతిర్మయి కారు దిగి అతని వెనగ్గా నడవసాగింది.

కళాత్మకంగా నిర్మింపబడిన ఆ భవనంలో తీర్చిదిద్దినట్లు అమర్చబడిన వస్తు సముదాయం, మురళి రాకతో వినయ విధేయతల్ని ప్రదర్శిస్తూ చేతులు కట్టుకు నిలబడి పోయిన నౌఖర్లు— అంతా చూసి దిగ్భ్రమ చెందింది జ్యోతిర్మయి. మురళి వంటి కోటీశ్వరుడు తనకు భర్త కాబోవటం కేవలం తన పురాకృత సుకృత మనిపించిందామెకు. తివాచీలు పరచిన హాలు మధ్యగా లోపలికి వెళ్తుంటే, అడుగులు తడబ



గుండెల్లో ఏదో తెలియని బెరుకుదనం విచ్చుకుంది.

రెండు మూడు హాల్స్ దాటి విశాలమైన గదిలో ప్రవేశించారు ఇద్దరూ. గది మధ్యలో నాలుగు వైపులా నాలుగు సోఫాలున్నాయి. ఒక సోఫాలో వయసు మళ్లిన వ్యక్తి ఒకాయన కూర్చుని ఏదో చదువు తున్నాడు. ఆయనకు దగ్గరగా తివాచీ మీద కూర్చుని ఆయన చదివేది ఆలకిస్తోంది — ఓ పండంటి ముత్తైదువ. మురళి తల్లి దండ్రులు వాళ్లే కాబోలనుకుంది జ్యోతిర్మయి.

సందేహంగా ఒక ప్రక్కకు నిలబడింది జ్యోతిర్మయి. మురళి వాళ్లిద్దరి దగ్గరగా వెళ్లి "అమ్మా, ఈమే జ్యోతిర్మయి" అన్నాడు, తల్లి నుద్దేశించి.

వాళ్లిద్దరూ తలెత్తి కొడుకునూ, ఆపైన జ్యోతిర్మయినీ చూసేరు. మురళి తల్లి లేచి జ్యోతిర్మయికి దగ్గరగా వచ్చి ఆమెను తేరిపార చూసింది. క్షణాల తర్వాత, "కూర్చో అమ్మా. అలాగే నిలబడిపోయావేం?" అంది, సోఫా చూపుతూ.

జ్యోతిర్మయి వినయంగా సిగ్గుపడింది. ఇంతలో ముసలాయనన్నాడు, "ఆహా... ఏం తెలివే! నువ్వు నిల్చొని కబుర్లు చెప్తూ ఆ పిల్లను కూర్చోమంటే ఎలా కూర్చుంటుందే? అందులోనూ కాబోయే అత్తగారివి"

అంతా సన్నగా నవ్వు కున్నారు. "వాళ్లిద్దరూ, మీ మాటలూ, మీరూను అంటూ తివాచీ మీదే చతికిలబడింది ఆవిడ. ఆవిడ కూర్చోగానే జ్యోతిర్మయికి కనుసైగ చేశాడు, మురళి. ఆవిడ ప్రక్కగా కూర్చుంది జ్యోతిర్మయి. మురళి సోఫాలో కూర్చున్నాడు.

విషయాన్ని ముసలాయన ప్రారంభించగా, తన కవసరమనుకున్న వివరాల నన్నిటినీ సేకరించుకుంది మురళి తల్లి. కొద్ది సేపు తదేకంగా జ్యోతిర్మయి వైపు నఖశిఖ పర్యంతం చూసి, కట్టూబొట్టూ విషయాల్లో ఆమె ఆచరణలో పెట్టాల్సిన మార్పుల్ని సూచించి అన్నది, "అమ్మాయ్ పెద్దగా అందగత్తె కాకున్నా మొహంలో కళుంది. కను ముక్కుతీరు బాగుంది. నాకేం అభ్యంతరం లేదు. వాడెటూ మన శచిని చేసుకోనని భీష్మించు కూర్చున్నాడు గనుక వాడిష్ట ప్రకారమే కానీయండి."

మురళి ఎగిరి గంతేసి, ఆవిడ కాళ్లకు

# అడ్డం తిరిగిన కథ

దణ్ణం పెట్టి తన విదేశ పర్యటనకు సంబంధించిన వివరాలు చెప్పేడు. అవన్నీ విన్న ముసలాయన, "అదేవిట్రా అంత శుభ వార్త ఇందాకట్నుంచీ చెప్పవేం" అని కొడుకుని మందలించేడు. ఆ దంపతుల ముఖాల్లో వెల్లి విరిసిన ఆనందాన్ని చూసి తనలో తను నవ్వుకుంది జ్యోతిర్మయి.

అక్కణ్నుంచీ సంభాషణ మురళి ఫ్రాన్స్ పర్యటన మీదికి మళ్లింది. ముసలాయన తా నసలెలా వ్యాపారాన్ని ప్రారంభించిందీ, అదెలా వృద్ధిచెందిందీ మొదలైన వివరాలు చెప్తూ, నలభై కంపెనీల మేనేజింగ్ డైరెక్టర్స్ 'అప్లై' చేసుకుంటే ఆ అవకాశం తన కొడుక్కు రావటం ఎంత గొప్ప విషయమో ఏకరువు పెట్టాడు.

ఆ తర్వాత మురళి ప్రయాణ సన్నాహాల్ని గురించి తల్లి దండ్రు లిద్దరూ మాట్లాడసాగేరు. పైగా అతనికి అప్పుడే 'జాగ్రత్త'ల్ని మూట కట్టటం మొదలెట్టేరు. సంభాషణని మధ్యలోనే త్రుంచేసి లేచాడు మురళి. సెలవు తీసుకోబోతూ వాళ్లిద్దరికీ నమస్కరించింది జ్యోతిర్మయి.

పార్వతీ పరమేశ్వరుల్లా వున్న ఆ దంపతుల స్వచ్ఛమైన కళ్లల్లోకి చూస్తుంటే, నమస్కరిద్దామని ఎత్తిన జ్యోతిర్మయి చేతులు వణికినై. నేరస్థురాలిలా ఆమె చూపులు నేలకు మరలినై. ఉవ్వెత్తున పొంగిన భావ సంఘర్షణని తనలోనే అణచుకుని గిర్రున వెనక్కు తిరిగింది. మూర్తీభవించిన మంచిదనంగా వున్న ఆ వృద్ధ దంపతుల్ని మభ్య పెట్టున్నానేమోననే అనుమానం కలిగి మనసంతా కలచినట్లైంది జ్యోతిర్మయికి.

ఇంటికి వచ్చిన జ్యోతిర్మయి మురళి ఎంతగా బతిమిలాడినా అతనితో ఆ పూట సరదాగా గడపలేకపోయింది. అనుకున్న కార్యక్రమాలనన్నిటినీ రద్దు చేసుకోక తప్పలేదు మురళికి.

మర్నాడు

తెల్లవారుతూనే వచ్చాడు మురళి. మురళి వచ్చేసరికి జ్యోతిర్మయి తలంటి పోసుకుని కురులార్చుకుంటున్నది. ఆ రోజు తను, మరి కొంతమంది మిత్రులూ కలిసి పిక్‌నిక్‌కి వెళ్లబోతున్నట్లు చెప్పేడు మురళి. జ్యోతిర్మయి రాకుంటే ఆ కార్యక్రమానికి శోభ లేనట్లు కూడా వర్ణించి, ఆమెను ఆహ్వానించాడు. జ్యోతిర్మయి 'సరే' నంది. మురళి ఆనందానికి హద్దే లేకుండాపోయింది.

మురళితో ఏకాంతంగా వుండటం తటస్థించి నప్పుడల్లా తన గుండెల్లో దాచుకున్న గరళాన్ని అతని ముందు కక్కేయాలని విశ్వప్రయత్నం చేసింది జ్యోతిర్మయి. అయితే, ఆ ప్రయత్నంలో ఆమె అసహాయ అయింది. ధైర్యాన్ని పుంజుకుని తీరా చెప్పేద్దామని నోరు మెదిపితే పెదవులు వణికి, శరీరం నీరుకారి మాట గొంతుదాటి వచ్చేదికాదు. మానసికమైన ఆందోళన, ఆవేదన దైహికమైన నిస్సహాయతగా పరిణమించేయి. ఇక, మురళికా రహస్యం ముఖాముఖిగా చెప్పలేననే నిశ్చయాని కొచ్చింది జ్యోతిర్మయి.

జ్యోతిర్మయి అనుభవిస్తున్న ఈ సంఘర్షణని మురళి గమనించలేదు. ఆమె అలిసినట్లు కనిపించి ఒకటి రెండుసార్లు ప్రశ్నించాడే గాని, అది అలసటకాదనీ, ఆమె, హృదంతరాళాల్లో మండుతున్న వేదన అనీ గుర్తించలేకపోయాడు.

పదిహేనురోజులూ పదిహేను నిముషాల్లా గడిచాయి మురళికి. జ్యోతిర్మయికి కాలం అంత వేగంగా పరుగెత్తుతున్న ఛాయ లేమీ కనిపించలేదు.

ఈ పదిహేను రోజుల్లోనూ మురళి ఆనందం కోసం అతనితో కలిసి తిరిగింది జ్యోతిర్మయి. మురళి తను విదేశాల్లో చేయబోయే ఘనకార్యాల్ని గురించి, అక్కడ నుంచితేబోయే విచిత్ర వస్తువుల్ని గురించీ ఏదేదో మాట్లాడేడు. జ్యోతిర్మయిపై తన కున్న ప్రేమను అనేక విధాలుగా ఆమెకు బహిర్గతం చేసి తా నామెను మరువనని బాసలు చేసి, ఆమె నుంచీ అలాగే ఎన్నెన్నో బాసలు తీసుకున్నాడు. ఈ పదిహేనురోజుల్లో, కూడా మురళి, సమస్యల్ని గురించి, వాటి పరిష్కారాల్ని గురించి, వ్యక్తిగత సంస్కారాన్ని గురించి ఉపన్యాసామిచ్చాడు. వీలైనప్పుడల్లా.

జ్యోతిర్మయికి కొంచెం ధైర్యం చిక్కింది. సమాజాభ్యుదయాన్ని కాంక్షిస్తూ, నాగరికంగా జీవిస్తూ, వినూత్నమైన భావాలతో అభిప్రాయాలతో విదేశాలకు వెళ్తున్న మురళి సంస్కారం తన బాధను అవగతం చేసుకోగలదనే ఆశ అంకురించింది. అతనికా విషయాన్ని నిర్భయంగా తెలియజేయవచ్చు

సనే నమ్మకమూ కలిగింది.

మురళి వెళ్లేరోజు వచ్చింది.

అతని తల్లిదండ్రులతోపాటు కారులో తనూ విమానాశ్రయానికి వెళ్లింది జ్యోతిర్మయి. ప్రాణాధికంగా ప్రేమించే అతని తల్లి మురళి 'ప్లేన్' దగ్గరికి నడుస్తుండగా ఉండపట్టలేక గొల్లున ఏడ్చింది. భర్త ధైర్య వచనాలు చెప్పి ఆమెను ఓదారుస్తున్న దృశ్యం చూసేసరికి జ్యోతిర్మయికే కళ్ళ నీళ్లు తిరిగినై.

నీళ్లు నిండిన కళ్లతోనే వీడ్కోలిచ్చేరు ముగ్గురూ.

* *

మురళి వెళ్లిన రెండు నెలల్లోను జ్యోతిర్మయి అతని నుంచి ఐదు వుత్తరాల్ని అందుకుంది. ఈ ఐదు జాబుల్లోను అతను ఎన్నెన్నో వింతల్ని గురించి రాసేడు. ప్రతి వుత్తరంలోనూ చివర స్వయంగా ఆమెకు వర్తించేటట్లు తమ ప్రేమను గురించి ఏదో ఒక ఛలోక్తి విసిరేవాడు. జ్యోతిర్మయికి దాన్ని మళ్లీ మళ్లీ చదువుకుని ఆనందించటం ఒక గొప్ప అనుభూతిగా మారింది.

కలిసిన మనసులు ఈ ఎడబాటుతో మరింత దగ్గరైై, ఇద్దరి హృదయాల్లోను తీయని భావాలు, బాధ మొలకెత్తినై.. ఊహల డోలల్లో ఉగుతూ పరవశమవుతున్న మనస్సుతో, ఆవేళ మురళికి జాబు వ్రాయాలని కూర్చుంది జ్యోతిర్మయి

తన విశేషాలు, మురళి తల్లిదండ్రుల విషయాలు అన్నీ వ్రాసి జాబు పూర్తి చేయబోయే సమయంలో చప్పున స్ఫురించింది. 'ఆ' విషయం కూడా రాస్తే బాగుంటుందని...అర్ధగంట సేపు ఆలోచించి వ్రాయటం ప్రారంభించింది.

'...ఈ రహస్యాన్ని మీకు నివేదించాలని మీతో పరిచయమైన నాటినుంచీ ఎంతగానో ప్రయత్నిస్తూనే వున్నాను. కాని, ఏదో అజ్ఞాత శక్తి ఎప్పటికప్పుడు నా గొంతు నొక్కేసింది. ముఖాముఖి వ్యక్తం చేయలేని ఈ బాధని ఈసారి వ్రాస్తున్నాను. విశాల దృక్పథంతో ఈ సమస్యని ఆలోచించి నన్ను క్షమిస్తారనే నమ్మకమే నాచేత ఇలా వ్రాయిస్తున్నది.

..ఇక, అసలు విషయం. విధి వైచిత్రాల్ని చూడటం, అనుభవించటం మనుష్యులకు క్రొత్తగాదు. నాకు సంభవించిన దుర్దశ కూడా అలాంటిదే. నాకు పదవ యేటనే ముచ్చటపడి నన్ను మా మావయ్య కొడుక్కిచ్చి వివాహం చేశారు, మావాళ్లు! అభంశుభం తెలియని పసిదాన్ని నేను. నా పన్నెండవయేట అతను మశూచికి గురయి 'మరణించాడు!....

..ఆ తర్వాత వివరాలు అవసరం లేదనుకుంటాను. మావయ్య కూడా మీ వంటి సంస్కరణాభిలాషి కావటం నా అదృష్టం. ఆయన ప్రోద్బలంతోనే చదువుకున్నాను. 'మళ్లీ పెళ్లి' అనే ఆలోచనని నాకు కలిగించిన ఘనత కూడా ఆయనదే...'

..'దీనిలో ఇంత ఆవేదన పొందాల్సిందేం వుంది?' అనే చల్లని మీ మాట కోసం వేయికళ్లతో ఎదురుచూస్తూ వుంటాను. సెలవ్.' మీ, జ్యోతిర్మయి.

రాసిన వుత్తరాన్ని మరోమారు చదువుకునే సరికి, గుండెల మీదనుంచీ కొండంత బరువు తీసినట్లయి స్వేచ్ఛగా వూపిరి పీల్చుకుంది జ్యోతిర్మయి.

* * *

రోజులు కాలగర్భంలో దాక్కుంటున్నాయి.

జ్యోతిర్మయికి విశాఖపట్టణం బదిలీ అయింది. మురళి నుంచీ తానాశించిన జాబు రాలేదు. దానికోసం ఎదురు చూసి చూసి, చివరికి అతని మంచితనాన్ని శంకించింది జ్యోతిర్మయి మనస్సు. మురళి వంటి వ్యక్తి తన గత చరిత్రను క్షమించలేకపోయాడంటే ఆశ్చర్యం, విషాదం రెండూ కలిగేయి

హైదరాబాద్ వదిలి వస్తూ మురళి తల్లిదండ్రుల వద్ద సెలవు తీసుకోటానికి వెళ్లింది జ్యోతిర్మయి. ముసలాయన మురళి పద్ధతి, ప్రవర్తనా తనకేమీ బాగాలేవని విసుక్కున్నాడు కనీసం వాళ్లకు వ్రాసే జాబుల్లోనైనా జ్యోతిని గురించి రాయకపోవటం తమకు అర్థం కావటంలేదన్నాడు. మురళి తల్లి మాత్రం "ఆ. కుర్రకుంక, వాడు ప్రత్యేకం ఏంరాస్తాడు? ఇదివరకు నిశ్చయించుకున్నదే గదా, నువ్వు ఇక్కడే వుండిపో జ్యోతీ, ఉద్యోగం వద్దూ ఊరూ వద్దు!" అంది.

ఆ సలహాకి సుతరామూ ఒప్పుకోలేదు జ్యోతిర్మయి. చివరికి ముసలాయన అన్నాడు "ఇంకో రెండునెలల్లో వాడు రావాలి గదా. రాగానే మేమే వచ్చి తీసుకొచ్చుకొంటాం" అని.

'అంతటిఅదృష్టానికి నే నోచుకున్నానా?' అనుకుని వచ్చేసింది జ్యోతిర్మయి.

* * *

మూడేళ్ళు గడిచినై జ్యోతిర్మయి ప్రస్తుతం చిత్తూరులో ఉద్యోగం చేస్తున్నది. మురళిని గురించి ఆమెకె వివరాలూ అందలేదు, ఈ మూడేళ్లల్లోను.

ఆవేళ, ఆఫీసులో తను పని చేసుకుంటుండగా ప్యూన్ కవరొకటితెచ్చిచ్చాడు జ్యోతిర్మయికి. ఆమె ఆ కవరందుకుంది. అది ఆమె హైదరాబాద్ అడ్రస్‌కు రాసింది, 'పార్ ఏవియన్' కవరు! హైదరాబాద్ నుంచీ అది వైజాగ్ వెళ్లి అక్కణ్నుంచీ చిత్తూరుకు 'రీ డైరెక్ట్' అయింది. కవరు మీది అడ్రస్‌ను పరీక్షగా చూసింది జ్యోతిర్మయి. పరిచయమైన రాతకాదు! ఆతృతతో, ఉత్సుకతతో చింపి చూసింది.

'నే నెవ్వరో నీకు బొత్తిగా తెలియదు కాని, నిన్ను గురించి నాకు పరోక్షంగా పూర్తిగా తెలుసు. స్వచ్ఛమైన నీ మనసు, అందమైన నీ ముఖం నాకు పరిచయమైనవి. జీవితంలో నాకు అందని ఆనందాన్ని, మాధుర్యాన్ని పంచిపెట్టిన భాగ్యశాలిగా నీయెడల నాకు అమితమైన కృతజ్ఞత, వాత్సల్యం వున్నై. నీ పరిస్థితులకు, దుస్థితికి జాలిపడటం తప్ప నేనేమీ చేయలేను. అయినా, ఆదరపూర్వకంగా, కృతజ్ఞతా సూచకంగా నేనిందుతో పంపుతున్న 'డ్రాఫ్టు'ను లంగికరించు. మన మిద్దరం మంచి మిత్రులుగా వుండిపోదాం. మోహన్ మా దేశంలో స్థిరపడి నన్ను పెళ్లాడాడు.

..మిత్రురాలు, మార్గరెట్'—

మురళి పేరు మురళీమోహన విశ్వేశ్వరావని చప్పున స్ఫురించింది జ్యోతిర్మయికి! ఆమె దిగ్భ్రమ చెందింది!! ●